విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

మంగళవారం 14 మే 2024 | 8పేజీలు

ప్రశాంతంగా పోటెత్తిన ఓటరు

తిరుపతి జిల్లాలో సగటు పోలింగ్ 73.76శాతం – అత్యధికంగా సత్యవేడులో 80.69శాతం

అత్యల్పం తిరుపతి 61.33 శాతం – బ్రాహ్మణ కాలువలో గాలిలోకి కాల్పులు

పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు

విశాలాంధ్ర–తిరుపతి: ఓటరు ప్రశాంతంగా పోటెత్తాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పోటీ పడి మరీ ఓటు వేశాడు. తిరుపతి జిల్లాలో సోమవారం రాత్రి 8గంటల వరకు సగటు పోలింగ్ 73.76శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా సత్యవేడులో 80.69.. అత్యల్పంగా తిరుపతి 61.33శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో 18,12,980మంది ఓటర్లు ఉండగా... 13,37,720మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. ఇందులో పురుషులు 8,83,330 మంది ఉండగా... 6,49,959మంది (73.58శాతం)... మహిళలు 9,29,466 మంతది ఉండగా... 6,87,203మంది (73.94శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఓటరు చైతన్యం చూసి ఎన్నికల అధికారులే ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. భగభగ మాడ్చే ఎండను సైతం లెక్క చేయకుండా బారులు తీరి మరీ ఓటు వేశారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా పురుషుల కంటే మహిళలే ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళల ఓట్లు మాకే అంటూ ఇటు వైసీపీ... అటు ఎన్డీయే కూటమి చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో నేతల తలరాత మార్చేది మహిళా ఓటరే అన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు. తిరుపతి జిల్లాలో చెదురు మదురు సంఘటనలు మినహా సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చంద్రగిరి నియోజకవర్గం బ్రాహ్మణకాలువ గ్రామంలో గొడవ పడుతున్న టీడీపీ, వైసీపీ వర్గీయులను చెదరగొట్టేందుకు పోలీసులు గాలిలో కాల్పులు జరిపారు. తిరుపతి నగరంలో పలు పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకులు దొంగ ఓట్లు వేస్తున్నా రంటూ ఎన్డీయే కూటమి నాయకులు నిరసన వ్యక్తంచేశారు. తిరుపతిలో పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తలను చెదరగొట్టేందుకు

2లో

జిల్లాలో స్వల్ప సంఘటనలు మినహా

పోలింగ్ ప్రశాంతం

– భారీగా పోలింగ్ శాతం నమోదు

విశాలాంధ్ర –చిత్తూరు : జిల్లాలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కొన్ని స్వల్ప సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో భారీగా పోలింగ్ శాతం నమోదు కావడం గమనార్హం. అనేక పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 6 .30గంటల నుంచి ఓటర్లు బారులు తీరారు.

2లో



రక్తపాతంతో
ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

విశాలాంధ్ర–గుడిపాల :

గుడిపాల మండలంలోని మండి కృష్ణాపురం పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ తరపున సురేష్ అనే ఏజెంట్గా కూర్చున్నారు పోలింగ్ కేంద్రంలోపలే ఆయనపై కొందరు కత్తితో దాడి చేసి రక్తపాతాన్ని సృష్టించారు వెంటనే సురేష్ ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు అనంతరం దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తులు చేస్తున్నారు. చిలాపల్లి పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ కార్యకర్తను మోహన్ కుమార్ ను వైసిపి కార్యకర్తలు దాడి చేసి గాయాలకు గురి చేశారు ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారు.

వార్త తరువాయి 2లో

పుంగనూరులో టిడిపి ఏజెంట్లు కిడ్నాప్

– కొన్ని కొన్ని పోలింగ్ బూత్‌లలో దొంగ ఓట్లు కలకలం

విశాలాంధ్ర – పుంగనూరు: నియోజవర్గ పరిధిలోని సదుం మండలానికి చెందిన బూరగ మంద గ్రామంలో పోలింగ్ స్టేషన్లో టిడిపి ఏజెంట్లుగా ఉన్న ముగ్గురిని వైసీపీ నాయకులు ఉదయం ఆరు గంటలకే వారిని కిడ్నాప్ చేయడం జరిగింది దీనితో ఇండియా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఎన్నికల అధికారులు పోలీసులకు ఆదేశాలు ఇవ్వడంతో పోలీసులు వారిని గుర్తించి మరల పోలింగ్ స్టేషన్లో ఏజెంట్లుగా పెట్టడం జరిగింది. అదేవిధంగా పుంగనూరు పట్టణంలో పోలీసు బందోబస్తు సక్రమంగా లేకపోవడంతో వైసిపి నాయకులు నేరుగా పోలింగ్ బూత్ లోనే ఉంటూ ఓటర్లకు ప్రలోభాలు చేస్తూ స్వయంగా వారి వెళ్లి లీనార్డ్ మున్సిపల్ హైస్కూల్ పోలీస్ స్టేషన్లో ఎన్ ఎస్ పేట మున్సిపల్ స్కూల్లో ఉన్న పోలీస్ స్టేషన్లో ధోబి కాలనీ మున్సిపల్ హై స్కూల్ పోలీస్ స్టేషన్లో ఓట్లు వేయించుకోవడం జరిగింది దీనితో వైసిపి టిడిపి ఏజెంట్ల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడడం జరిగింది పోలీసులు జోక్యం చేసుకొని ఎన్నికలు సజావుగా జరగడానికి ఇరు పార్టీల సహకరించాలని వారిని వేడుకోవడంతో ఎన్నికల సరళి సజావుగా సాగింది.

గ్రామ మౌలిక వసతుల కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు

విశాలాంధ్ర – నాయుడుపేట : నాయుడుపేట మండలం విన్నమాల పంచాయతీ కమ్మవారిపాలెంలో గ్రామ మౌలిక వసతుల కోసం గ్రామస్తులు రోడ్డెక్కిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలు మేరకు కమ్మవారిపాలెం గ్రామస్తులు తమ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక, తరతరాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తమ గ్రామానికి మౌలిక వసతులు కలుగచేయునందుకు తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ఉదయం తేల్చి చెప్పారు. గ్రామ సర్పంచి వాకాటి సోమశేఖర్ గ్రామస్తులు వద్దకు చేరుకుని వారి సమస్యలను త్వరలో తీరుస్తామని వారికి హామీ ఇచ్చారు. గ్రామస్తులను సర్దుబాటు చేసి, ఓటు వేసేలా అంగీకరింప చేశారు. కమ్మవారిపాలెం గ్రామస్తులు దినసరి కూలీలకు వెళ్తూ, తమ కుటుంబాలను నెట్టుకు వస్తున్నారు.నాయుడుపేట పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న ఈగ్రామానికి సరైన రహదారి పరిస్థితి లేదంటే నమ్మశక్యం కాదు. తరతరాలుగా పాలకుల వంచనకు గురవుతున్న వంచనకు గురవుతున్న పేద ప్రజలు గోడు రానున్న ప్రభుత్వ కాలంలోనైనాపాలకులు ఆలకిస్తారా అన్నది వేచి చూడవలసిందే.

ఇంటి ఓటుకు నోచుకుని వృద్ధులు

– వీల్ చైర్‌లో ఓటింగ్‌కు వెళ్లిన వికలాంగులు

విశాలాంధ్ర – బుచ్చినాయుడు కండ్రిగ : సార్వత్రిక ఎన్నికలలో భాగంగా పార్లమెంట్ సాధారణ ఎన్నికలు, లోకసభ ఎన్నికలలో తొలిసారి వృద్ధులు వికలాంగుల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇంటి వద్దకే ఓటు వేయడానికి అవకాశాన్ని కల్పించింది. మండలంలో సోమవారం జరిగిన ఎన్నికలలో బి ఎన్ కండ్రిగ పంచాయతీ, గోవిందప్పా నాయుడు కండ్రిగ, పార్లపల్లి, మరికొన్ని గ్రామాలలో వికలాంగులు, వృద్ధులు, బుద్దిమాన్యం కలిగిన వారు ఓటింగ్ కేంద్రాలలో వారి ఓటును వినియోగించుకున్నారు. ఓట్ ఫ్రమ్ హోమ్ లో భాగంగా ఎన్నికల సిబ్బంది సదరు ఓటు ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేయించే కార్యక్రమంలో వైఫల్యం చెందడంతో, పోలింగ్ కేంద్రాలకి వచ్చి ఓటు వేశారు, ఎన్నికల అధికారి నిబంధనల ప్రకారం 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, 40% కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి ఇంటి నుంచి ఓటు వేసేలా కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది అయినప్పటికీ, ఈ మండలంలో ఉన్న వారికి అవకాశం కల్పించలేకపోయారు, వీరు ఓటింగ్ వేయడానికి ఇబ్బందులకు గురయ్యారు.

రక్తపాతంతో... ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి) గుడిపాల 208,209 పోలింగ్ కేంద్రం వద్ద ఇరు వర్గాలు అల్లర్లకు దిగగా ఒక గంట సమయం పోలింగ్ ఆగిపోగా చిత్తూరు జాయింట్ కలెక్టర్, ఎస్పీ, డి.ఎస్.పి లు గుడిపాలకు చేరుకుని అల్లర్లను అదుపులోకి తీసుకొని తిరిగి పోలింగ్ ప్రారంభించారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలలో విల్లారి కుప్పం, గుడిపాల, 13 గొల్లపల్లి, శ్రీరంగంపల్లి, పాపి చెట్టు పల్లి, బీలాపల్లి అల్లర్లతో ముగిసింది 7 గంటలకు పోలింగ్ కేంద్రాలను మూసివేయడంతో సమాచారం మేరకు మండలంలో 83% పోలింగ్ అయినట్లు అధికారులు వెల్లడించారు.

పోలింగ్ ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి) కొన్నిచోట్ల సాయంత్రం 6 గంటల వరకు కూడా ఓటర్లు క్యూ లైన్ లో వేచి ఉండాల్సి వచ్చింది. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ కు కొంత అంతరాయం ఏర్పడింది. వెంటనే టెక్నికల్ సిబ్బంది వీటిని మరమ్మతులు చేయడంతో పోలింగ్ తదుపరి కొనసాగింది. జిల్లా కలెక్టర్ జిల్లా సచివాలయంలో ఉంటూ నిత్యం పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. సాయంత్రం ఐదు గంటలకు 75 శాతం పోలింగ్ నమోదయింది. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉంది. చిత్తూరు నియోజకవర్గంలోని గుడిపాడు లో వైసీపీ కార్యకర్తపై టీడిపి కార్యకర్తలు కత్తితో దాడికి పాల్పడడంతో అక్కడ కొంతసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా ఎస్పీ బలగాలను పంపించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు వైసీపీ అభ్యర్థి విజయానంద రెడ్డి ల మధ్య నగరంలోని మిట్టూరు పోలింగ్ బూత్ వద్ద వాగ్వివాదం చోటుచేసుకుంది. మిట్టూర్ పోలింగ్ బూత్ లోకి మాజీ ఎమ్మెల్యే సీకే బాబు వెళ్లడంతో దీన్ని వైసీపీ అభ్యర్థి విజయానంద రెడ్డి అడ్డుకునే ప్రయత్నం చేశారు దీంతో కొంతసేపు ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని ఉద్రిక్తత పరిస్థితికి కారణమైంది. వెంటనే చిత్తూరు అసెంబ్లీ ఆర్ వో శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువురికి సర్ది చెప్పి పంపారు. పుంగనూరు నియోజకవర్గంలో పలుచోట్ల వైసిపి టిడిపి కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నాయి. సదుము మండలంలో టీడీపీ ఏజెంట్లను వైసీపీ నేతలు కిడ్నాప్ చేయడం అనంతరం అధికారులు జోక్యం చేసుకొని వారిని విడిచిపెట్టడం జరిగింది. జిల్లాలో అనేక పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు ఉదయం నుంచి తరలి వచ్చారు. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా కొన్ని స్వల్ప సంఘటన పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది.

ప్రశాంతంగా పోటెత్తిన ఓటరు

(మొదటి పేజీ తరువాయి) పోలీసులు పలు మార్లు లాఠీఛార్జి చేశారు. కొన్ని చోట్ల చెదురు మదురు సంఘటనలు మినహా ఇస్తే... మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉదయం 6గంటలకే ఓటర్లు బూత్ ల వద్దకు పోటెత్తారు. ఓట్లు వేసేందుకు బూత్ ల వద్దకు వందలాదిగా తరలివచ్చారు. యువత, మహిళలు, వృద్ధులు ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నియోజకవర్గాల వారీగా రాత్రి 8గంటల వరకు పరిశీలిస్తే... గూడూరులో 73.11శాతం, సూళ్లూరుపేటలో 76.98శాతం, వెంకటగిరిలో 75.25శాతం, చంద్రగిరిలో 75.709శాతం, తిరుపతిలో 61.33శాతం, శ్రీకాళహస్తిలో 76.44శాతం, సత్యవేడులో 80.69.34శాతం పోలింగ్ నమోదైంది. పూర్తి పోలింగ్ శాతం ఇంకా తేలాల్సి ఉంది. కాగా చంద్రగిరిలో 3,15,159మందికి 2,38,588 మంది, గూడూరోల 2,45,205మందికి 1,79,280మంది, సత్యవేడులో 2,15,385 మందికి 1,73,793 మంది, శ్రీకాళహస్తిలో 2,48,536మందికి 1,89,976మంది, సూళ్లూరుపేటలో 2,42,610మందికి 1,86,756 మంది, తిరుపతిలో 3,02, 503మందికి 1,85,528మంది, వెంకటగిరిలో 2,43,582మందికి 1,83,299మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈ పర్యాయం పోలింగ్ శాతం భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇక జిల్లాలో పలు చోట్ల చిన్న చిన్న ఘర్షణలు జరిగాయి. పోలీసులు వెనువెంటనే పరిస్థితులను అదుపులోకితెచ్చారు. జిల్లాలోని పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. తిరుపతి నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ మందకొడిగా సాగడం తో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తెల్లవారి 6గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చినా.. పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ సంఖ్యలో ఓటర్లు బారులు తీరారు. అయితే పలు చోట్ల పోలింగ్ ప్రారంభించడంలో కొంత ఆలస్యం కావడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

సోమల మండలంలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్...

విశాలాంధ్ర - సోమల : సోమల మండలం లో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసిన సంఘటన.2024వ సం.లో అసెంబ్లీ ,పార్లమెంటు ఎన్నికల ను నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం గత 2 నెల ల క్రితం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ పర్యాయం ఎన్నికల ను గతం లో జరిగిన అనుభవాలు దృష్టిలో ఉంచు కుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో లొనే సోమల మండలం లో 34 405 ఓటర్లు ఉండగా 80 శాతం పైగా 8.గం.లకు పోలైనట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. ఇంకా రెండు పోలింగ్ స్టేషన్లు లో అనగా టి.ఎం.గొల్ల పల్లి ,పొదల కుంట పల్లి లో పోలింగ్ కోన సాగుతునట్లు తెలిపారు. మండలం లో సోమవారం జరిగిన పోలింగ్ లో ఒకటి ,రెండు చోట్ల చెదురు ముదురు సంఘటనలు మినహా మిగతా ప్రాంతాల్లో ప్రశాంతంగా ఓటర్లు తమ ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. ఎన్నికల సంఘం తీసుకొన్న చర్యలు అలాగే అధికారులు ,ఓటర్లు సహాయ సహకారాలు ,రాజకీయ నాయకుల సమయస్ఫూర్తి తో ప్రశాంతంగా ముగిసిన ట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు.

ఇరు పార్టీలలో ఆశలు రేకెత్తిస్తున్న భారీ ఓటింగ్

విశాలాంధ్ర - నాయుడు పేట : రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో ఓట్ల పండుగకు ఓటర్లు పోటెత్తారు.అధికార పక్షంపై వ్యతిరేకతతో ఓటర్లు భారీ ఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాము అమలు చేసిన సంక్షేమ ఫలాలను తిరిగి కొనసాగించుకునేందుకు ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వచ్చారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఆనం దాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఓటు ఎవరికి వేశారన్న విషయాన్ని మనసులోనే ఉంచుకున్న సగటు ఓటరు ఇరు పార్టీ అభ్యర్థులను కలవరపెడుతూ, గమ్మునంగా వ్యవహరిస్తున్నాడు. ఓటరు నాడి తెలియక పోటీలో ఉన్న అభ్యర్థులు కోట్లు ఖర్చుపెట్టి తలలు పట్టుకుని కూర్చుని ఉన్నారు. జూన్ నెల నాలుగో తారీఖు ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల భవిష్యత్తు బయటప డనుంది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1818 మంది ఉద్యోగస్తులు తమ ఓటు హక్కును వినియోగించుకొని ఉన్న విషయం తెలిసిందే. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లు భారీ సంఖ్యలో చేరుకుని, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. యువకులు, మహిళలు, ముసలి వాళ్ళ అన్న బేధం లేకుండా, పల్లె, పట్టణం అన్న తారతమ్యం లేకుండా ఈ ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో పాల్గొనడం విశేషం. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నెలవల విజయశ్రీ తన తండ్రి తిరుపతి మాజీ పార్లమెంట్ సభ్యులు నెలవల సుబ్రహ్మణ్యం, తల్లి అమృత సరళి లతో కలిసి మండల పరిధిలో భీమవరం గ్రామం నందు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిసన్నారెడ్డి దయాకర్ రెడ్డి తన ఓటు హక్కును నాయుడుపేట పట్టణం నందు వినియోగించుకున్నారు.సూళ్లూరుపేట నియోజకవర్గం లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కందాటి రజనీకాంత్ మండల పరిధిలో మేనకూరు గ్రామంలో కుటుంబంతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. పట్టణ పరిధిలో అగ్రహారపేట పోలింగ్ కేంద్రం నందు సుళ్ళూరుపేట నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి బురకాల. లీలామోహన్ కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. ఉదయం 11:00 గంటల వరకు పోల్ అయినా ఓట్లు పర్సెంటేజ్ 28.39% వోటింగ్ పోల్ అయినాయి. మధ్యాహ్నం 03:00 గంటల వరకు పోల్ అయినా ఓట్లు 54.85% జరిగింది. సాయంత్రం 05:00 గంటల వరకు పోల్ అయినా ఓట్లు 69.07% జరిగింది.

కిరాయి రౌడీలతో కొట్టించారు

రౌడీయిజాన్ని ప్రజలు సహించరు

చిల్లకూరు ఎస్ఐ అంజిరెడ్డిని సస్పెండ్ చేయాలి

గూడూరు చరిత్రలోనే రక్తదాడి తొలిసారి

- మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం

విశాలాంధ్ర - గూడూరు : తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ కిరాయి రౌడీల దాడి దారుణమని మాజీ ఎమ్మెల్యే, ఎన్డీయే ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాశం సునీల్ కుమార్ ధ్వజమెత్తారు. సోమవారం చిల్లకూరు 114వ నెంబర్ జెడ్పీ హైస్కూల్ పోలింగ్ బూత్ లో టీడీపీ, వైసీపీ ల నడుమ ఏజెంట్ విషయమై వాగ్వివాదం చోటుచేసుకుందన్నారు. ఈ నేపథ్యంలో చిల్లకూరు దర్గా వద్ద ఉన్న పోలింగ్ బూత్ లో టీడీపీ సీనియర్ నాయకుడు పట్టాభిరెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ ల నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది. నిన్ను వేటాడుతా, వెంటిడుతా అంటూ వైసీపీ అభ్యర్థి దౌర్జన్యం చేశారన్నారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. మళ్లీ 114వ నెంబర్ బూత్ వద్ద గొడవ తీవ్రమైందన్నారు. టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డిని యద్దల నరేంద్ర రెడ్డిల నడుమ తోపులాట చోటుచేసుకుందన్నారు. రామచంద్రారెడ్డిపై దాడి చేసిన విషయాన్ని తెలుసుకుని సంఘటనా స్థలానికి వెళ్లానన్నారు. చిల్లకూరు ఎస్ఐ అంజిరెడ్డి ఏకపక్షంగా టీడీపీ కార్యకర్తలను, మహిళలను పరిగెత్తించి మరీ దాడి చేశారన్నారు. దీనిని అడ్డుకునే ప్రయత్నం చేసిన తనను అప్పటికే ఆరోగ్యం సరిలేక రాత్రంతా సెలైన్ ఎక్కించుకుని అదే కట్టుతో వచ్చిన తనను ఒక మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యే అభ్యర్థి అని కూడా చూడకుండా చేయి పట్టు కుని లాగడంతో సూది ఊడి రక్తం కారిపో యిందన్నారు. ఇటువంటి రౌడీ ఎస్ఐను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశా రు. గతంలో డీఎస్పీ, చిల్లకూరు ఎస్ఐపై ఎన్ని కల కమిషన్ కు కూడా ఫిర్యాదు చేశామ న్నారు. కార్యకర్తలు, నాయకులకు ఏకపక్షంగా దాడిచేయడమే కాకుండా వైసీపీ నాయకులకు అప్పగించిన ఎస్ఐపై శాఖాపర మైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

సులూరుపేటలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

విశాలాంధ్ర - సూళ్లూరుపేట. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి ఓటర్లు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు ఎండను సైతం లెక్కచేయకుండా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డి ఆర్ డి ఎల్ కాలనీ, కొన్ని ప్రాంతాలలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ప్రక్రియ గంట ఆలస్యంగా ప్రారంభమైనది. గణపతి నగర్ పోలింగ్ బూత్ ఏరియాలో తెలుగుదేశం వైసిపి ఇది వర్గాల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగే సమయానికి విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువురిని సమీప ప్రాంతం నుండి దూరంగా పంపియడం జరిగింది మిగిలిన ప్రాంతాలలో ఎలాంటి గొడవలు లేకుండా 76.98% పైబడి పోలింగ్ శాతం జరిగింది ఇంకా 6 గంటల లోపు క్యూలైన్లో ఉన్నవారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. ఇప్పటికి బార్లు తీసి ఉన్న ఓటర్లు అనేకమంది ఓటు వేసేందుకు ఉత్సాహం చూపుతూ ఉన్నారు. వికలాం గులు ఓటు వేసేందుకు మూడు చక్రాల బండిని ఏర్పాటు చేశారు. పోలింగ్ సమయంలో రిటర్నింగ్ అధికారి చంద్రముని ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు సౌకర్యము కల్పించారు.

ఓటు హక్కు ఉపయోగించుకొన్న పులివర్తి నాని

విశాలాంధ్ర - పాకాల : చంద్రగిరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పులివర్తి నాని పాకాల లో తన ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. సోమవారం పోలింగ్ సందర్భంగా తన స్వగ్రామం పాకాల మండలంలోని పులివర్తి వారి పల్లి లోని 166 వ నెంబర్ బూతులో తన సతీమణి సుధా రెడ్డి, కుమారుడు వినీల్ , కోడలు త్రిష్యా రెడ్డిలతో కలిసి ఓటు వేశారు.

నియోజకవర్గంలో 54.8% నమోదు

విశాలాంధ్ర- గూడూరు: నియోజకవర్గంలో 54.82% ఓట్లు నమోదు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.కిరణ్ కుమార్ తెలిపారు.నియోజక వర్గంలో మొత్తం 2,45,385 ఓట్లుకు గాను సాయంత్రం 4 గంటలకు 1,34,421 ఓట్లు పోలైనట్లు తెలిపారు.ఇంకా రెండు గంటలు సమయం ఉండటంతో ఓటర్లు క్యూ లైన్లలో బారులు తీరి ఉన్నారు.అరు గంటలకు క్యూలో ఉన్న ఓటర్లుకు ఓటు వేసే అవకాశం ఉంటుంది ఈ ఎన్నికల్లో పట్టణంలోని.ఓటర్లు ఎక్కువ మంది ఓటింగ్ లో పాల్గొనడం విశేషం.

బి.ఎన్.కండ్రిగ మండల 82 శతం నమోదు

అక్కడక్కడ మొరాయించిన యంత్రాలు
రెండు చోట్ల ఆలస్యంగా మొదలైన ఎన్నికలు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలో 28 పంచాయతీలలో 35 పోలింగ్ కేంద్రాలలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. 82 శతం ఓటింగ్ నమోదు అయినది. తలారివెట్టు పంచాయతీలో సుమారు గంట పాటు ఎన్నికలు మొదలు కాలేదు, వేణుగోపాలపురం పంచాయతీలో సాంకేతిక లోపం వలన ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది బాలింతలు, చిన్నపిల్లల తల్లులు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు, నీర్పాకోట గ్రామంలోని గిరిజన కాలనీ లో ఉన్న పోలింగ్ కేంద్రం వద్ద కొంత వివాదం చోటు చేసుకున్నది. అదనపు ఎన్నికల అధికారి పఠాన్ అహ్మద్ అలీ భాష ఎన్నికల సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన పోలింగ్ విధానాన్ని అభినందించారు. ప్రతి పోలింగ్? స్టేషన్లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, మరుగుదొడ్లు, వీల్ చైర్ తో పాటు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చిన్నచిన్న సంఘటనలు మినహా మండలంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆర్ అనంతపురం పోలింగ్ కేంద్రంలో 90 శాతం ఎన్నికలు పూర్తయ్యాయి. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయి.

పాకాలలో స్వల్ప ఘర్షణలు మినహా ప్రశాంతంగా పోలింగ్

విశాలాంధ్ర - పాకాల : పాకాల మండలంలో సోమవారం కొనసాగిన ఎన్నికల పోలింగ్ స్వల్ప ఘర్షణలు మినహా ప్రశాంతంగా సాగింది. చంద్రగిరి నియోజకవర్గం సమస్యాత్మకం కావడంతో మండలంలోని 54 బూతులు లలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ మొదలైంది. మద్ది నాయన పల్లి ,నేల దాని పల్లి బూతులలో ఈ వీ ఎం లు పనిచేయకపోవడంతో పోలింగ్ ఒక గంట ఆలస్యం గా ప్రారంభమయ్యింది. పోలింగ్ మొదలుపకముందే ఓటర్లు క్యూలైన్లో బారులు తీరారు. మధ్యాహ్నం వరకు పోలింగ్ కేంద్రాల్లో రద్దీ కొనసాగింది. అక్కడక్కడ ఏజెంట్ల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లకు పోలింగ్ ఆఫీసర్లకు మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. అంతకు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది.

భీమవరం గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్న నెలవల విజయశ్రీల (ఫోటో 4)
విశాలాంధ్ర నాయుడుపేట రూరల్: మండల పరిధిలో గల భీమవరం గ్రామంలో సోమవారం ఉదయం సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం, భాజపా, జనసేన ఉమ్మడి అభ్యర్థి నెలవల విజయశ్రీ తొలి ఓటు వేసి పోలింగ్ ను ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులు క్యూ లైన్ లలో నిలబడి తమ ఓటును ఉపయోగించుకున్నారు.

మండలంలో ప్రశాంతంగా పోలింగ్...
ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న కొత్త ఓటర్లు

విశాలాంధ్ర - వి.కోట: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఎడు గంటలకే ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైనా కొన్ని కేంద్రాల్లో ఈవియం లు మొరాయించడంతో ఓటర్లు కాస్త ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చింది. అనంతరం డిజిటల్ అసిస్టెంట్లు ద్వారా యంత్రాలను సరి చేసి ఓటింగ్ సజావుగా జరిగేలా చేశారు. ఎండలు పెరుగుతాయని ఉదయం ప్రారంభ. సమయంలోనే ఓటర్లు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కాస్సేపు ఓటింగ్ మందకొడిగా సాగిన అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓటింగ్ కు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఎండలు తగ్గి వాతావరణం మేఘావృతమై అనుకూలంగా మారడంతో ప్రజలు స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఇదిలా ఉంటే కొత్త ఓటర్లు ఓటింగ్ లో మొదటిసారి గా చాలా ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. పల్లెల్లో ని ప్రతి బూత్ లోనూ ప్రజలు బారులు తీరి గంటల తరబడి నిలబడి ఓటు వేశారు. మండలంలో మొత్తం 70 330 ఓట్లు ఉండగ సాయంత్రం 5 గంటల సమయం వరకు 72.33 శాతం మంది ఓట్లు వినియోగించుకు న్నారు. కాగా ఎస్ బండపల్లి, నెర్నిపల్లి, కుంభార్లపల్లి, జవునిపల్లి, తోటకనుమ పంచాయతీలలో రాత్రి వరకు ఓటింగ్ కొనసాగింది.అయితే మండలానికి. సంబంధించిన పూర్తి ఓటింగ్ శాతం వివరాలు తెలియాల్సి ఉంది.కాగా స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ దంపతులు తోటకనుమ లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ సరళిని ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్. అమర్నాథ్ రెడ్డి లు మండల ఎన్నికల సరళిని పర్యవేక్షించారు.

మార్పుకోసం....
ప్రజలు ఎదురు చూస్తున్నారు

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి సోమవారం 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తమ స్వగ్రామం పెరుమాళ్ళపల్లిలో కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గల వ్యాప్తంగా పోలింగ్ సరళిని పరిశీలించి,ఏజెంట్లు కు తగు సూచనలు చేశారు.దివాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఉదయం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా ,నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించు కుంటున్నారని అన్నారు. మార్పుకోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, రాబోయేది కూటమి ప్రజా ప్రభుత్వమేనని, చంద్రబాబు నాయుడుకి గిఫ్ట్ గా చంద్రగిరి, శ్రీకాళహస్తి లలో టిడిపి జెండా ఎగురవేయడం ఖాయమని అన్నారు.మన ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని,యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మొదటి ప్రాధాన్యం కలుగుతుందని అన్నారు.

సార్వత్రిక ఎన్నికలలో సచివాలయ సిబ్బంది అత్యుస్తాహం

విశాలాంధ్ర - గుడిపాల : గుడిపాల మండలంలోని గుడిపాల గ్రామంలో 208, 209 పోలింగ్ కేంద్రాలలో ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది దినేష్, చేతన్ లు పోలింగ్ గదులలోకి వెళ్లి తిరిగి బయట బి ఎల్ వో లకు కేటాయించిన స్థలానికి వెళ్తూ వస్తూ ఓటర్లను ప్రలోభ పరిచారు. ఓటర్లు దీనిని గమనించి అడుగగా మేము బిఎల్ఓ సిబ్బంది పోలింగ్ గదులలోకి వెళ్లి రావడానికి వెళ్లి రావడానికి మాకు అనుమతి ఉన్నది దానిని అడగడానికి మీకు ఎలాంటి అధికారం లేదు అని ఓటర్లపై విరుచుక పడ్డారు, అదేవిధంగా వాలంటీర్లు వికలాంగులు మరియు వృద్ధులను పోలింగ్ గదులలోకి తీసుకెళ్లి వారి ఓట్లను వాలంటీర్లే వేయడం జరిగింది అధికారులు నిర్లక్ష్యంతోనే ఇలాంటి కార్యకలాపాలకు సచివాలయ సిబ్బంది మరియు వాలంటీర్లు అత్యుస్థాహం చూపించారు.

బైరెడ్డిపల్లిలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

విశాలాంధ్ర - బైరెడ్డిపల్లి :మండల కేంద్రమైన బైరెడ్డిపల్లి లో సోమవారం సారూద్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ పూర్తి అవ్వవలసి ఉండగా 6:00 కన్నా ముందుగా క్యూలో ఉన్న ఓటర్లకు ఎనిమిది గంటల వరకు ఓటింగ్ వేయడానికి అనుమతించారు. మండలం మొత్తంలో 75% ఓటింగ్ నమోదయింది. మండల కేంద్రమైన బైరెడ్డిపల్లిలో ఉదయం వైసిపి టిడిపి కార్యకర్తలు మధ్య స్వల్ప ఘర్షణలు జరిగాయి. అదేవిధం గా మధ్యాహ్నం కూడా స్వల్ప ఘర్షణలు జరిగాయి. పోలీసులు అప్రమ త్తమై ఇరువర్గాలను చెదరగొట్టారు. నూతనంగా ఓటర్లు నమోదు చేసు కున్న యువకులు ఉత్సాహంగా ఆత్రుతగా ఓటింగ్లో పాల్గొన్నారు. అద విధంగా మండలంలోని దాసార్లపల్లిలో 101 సంవత్సరాలు వయసులో బి లక్ష్మమ్మ అనే శతాధిక వృద్ధురాలు ఓటింగ్లో పాల్గొనడం గమనార్హం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల అధికారులు తగు జాగ్రత్తలు చేపట్టారు. అదేవిధంగా దాసర్లపల్లి లో గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఓ మహిళకు ఈసారి ఓటర్ లిస్టులో పేరు లేకపోవడంతో వాళ్ళు ఆందోళన చెందారు. కొన్ని గ్రామాలలో ఓటర్ లిస్టులో గల్లంతైనట్లు ఆరోపణలు ఉన్నాయి.

చిల్లకూరులో ఘర్షణ నివారించిన పోలీసుయంత్రాంగం

విశాలాంధ్ర-చిల్లకూరు: మండల కేంద్రం చిల్లకూరు లో హైస్కూలు సమీపంలో సోమవారం వైసిపి, టిడిపి పార్టీలు వాగ్వాదం తో ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు పూర్తి సంయమనం తో వ్యవహరించడంతో పరిస్థితి అదుపులోకి రావడం జరిగింది. ఇరువర్గాల వారిని అక్కడ నుండి పంపిచారు. అసెంబ్లీ అభ్యర్థులు మేరిగ మరియు పాశిం తమ తమ నాయకులకు కార్యకర్తలకు మద్దతు తెలపడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఒకరినొకరు తీవ్ర పదజాలం తో దూషణ పర్వం సాగింది. ఎన్నికల ప్రక్రియ మాత్రం యధావిధిగా కొనసాగింది.

చెరివి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు విద్యుత్ షాక్

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు మండలం చెరివి పోలింగ్ కేంద్రంలో అపశృతి చోటు చేసుకుంది. సోమవారం ఓటు వేయడానికి క్యూ లైన్లో బారులు తీరిన ఓటర్లు పక్కనే గోడకు ఉన్న వైర్ను తాకడంతో విద్యుత్తు షాక్కు గురైన సంఘటన చోటుచేసుకుంది. చెరివిలోని 231 నెంబర్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించు కునేందుకు ఓటర్లు పలువురు బారులు తీరారు. పోలింగ్ కేంద్రం ప్రవేశద్వారం వద్ద బారులు తీరిన ఓటర్లలో చెరివి ఎస్టీ కాలనీ చెందిన అంకయ్య పక్కనే ఉన్న గోడను తాకడంతో విద్యుత్ షాక్కు గురి అయ్యారు. దీంతో తోపులాటతో మరి కొంతమంది ఓటర్లకు కూడా విద్యుత్తు షాక్కు కావడం జరిగింది. గోడ పైన ఉన్న విద్యుత్తు విద్యుత్ సరఫరా గోడకు సరఫరా కావడంతో ఈ పరిస్థితి తలెత్తినట్టు బాధిత ఓటర్లు చెప్తున్నారు. అయితే ఒకసారి ఓటర్లకు విద్యుత్ షాక్ తగలడం వల్ల పలువురు ఓటర్లు భయాందోళనకు గురై పరుగులు తీశారు. దీంతో కాసేపు పోలింగ్ కేంద్రంలో ఏమి జరుగుతుంది ఏమో అన్న భయాందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో అక్కడ ఉన్న పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. అయితే పోలింగ్ కేంద్రం సమీపంలో పక్కా భవనం ఉన్నప్పటికీ పాత రేకుల షెడ్లోని పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో సమస్యలు తలెత్తిందని ఓటర్లు వాపోయారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు అన్ని ఏర్పాట్లు చేశామని ఆర్భాటంగా ప్రకటనలు ఇచ్చిన అధికారులు చెరివి రేకుల షెడ్డులో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారి స్పందించాల్సి ఉంది

డివి సత్రంలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

అక్కడక్కడ మొరాయించిన యంత్రాలు - రెండు చోట్ల ఆలస్యంగా మొదలైన ఎన్నికలు

విశాలాంధ్ర - దొరవారిసత్రం: మండలంలో 22 పంచాయతీలలో 41 పోలింగ్ కేంద్రాలలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మండల పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలో సుమారు గంట పాటు ఎన్నికలు మొదలు కాలేదు, కొత్తపల్లి పంచాయతీలో సుమారు 2 గంటలు పైగా సాంకేతిక లోపం వలన ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. పొలిరెడ్డిపాలెం, డీవి సత్రంలో అర్ధగంట వరకు ఈవియం మిషన్ లు పని చేయకపోవడంతో అధికారులు స్పందించి వాటిని సిద్ధంచేశారు. బాలింతలు, చిన్నపిల్లల తల్లులు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రతి పోలింగ్? స్టేషన్లో ఓటర్లకు ఇబ్బందులుతలెత్తకుండా తాగునీరు, మరుగుదొడ్లు, వీల్ చైర్ తో పాటు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చిన్నచిన్న సంఘటనలు మినహా మండలంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయి. ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనను చోటు చేసుకోకుండా ఎస్సై తిరుమలరావు అతని సిబ్బంది గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి

- యువకుడికి గాయాలు

విశాలాంధ్ర - పాకాల : పాకాల మండలంలో సోమవారం ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. ఏనుగు దాడి లో ఒక వ్యక్తి మృతి చెందగా మరొక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం ఉదయం పూతలపట్టు మండలం సరిహద్దు ప్రాంతమైన పిల్లి గుండ్ల పల్లె వద్ద ఒంటరి ఏనుగు దాడి చేయడంతో తమిళనాడు రాష్ట్రానికి చెందిన కార్తివరాయన్ (52) మృతి చెందాడు. ఇతను తమిళనాడు రాష్ట్రం తిరువన్నమలై జిల్లా జంగం తాలూకా పెరుమల పడి కి చెందిన వాడు. ఇతను ఉపాధి కోసం తమిళనాడు నుండి పాకాల మండలంలో కట్టు రాయి కొట్టే వారి వద్ద కూలిగా చేరాడు . ఏనుగు రాకను గమనించకుండా తన పని చేసుకుంటున్న ఇతనిపై ఏనుగు వెనుక వైపు నుండి దాడి చేసి చంపేసింది . అనంతరం పాకాల మండలంలోని చెన్ను గారి పల్లి గ్రామపంచాయతీ మణిపిరెడ్డిపల్లి వైపుగా వచ్చింది. ఏనుగును దారి మళ్లించేందుకు చెన్నుగారిపల్లి హరిజనవాడ కు కొంతమంది యువకులు ప్రయత్నించగా వారిలో చెన్నుగారిపల్లి హరిజనవాడకు చెందిన. చెందిన ముని రాజా కుమారుడు పార్ధసారథి పై దాడి చేసి గాయపరిచదంతోపాటు అదే గ్రామానికి చెందిన హరిబాబు స్కూటర్ ను ధ్వంసం చేసింది. అనంతరం సమీపంలోని పాకాల పెద్ద చెరువు లోనికి ప్రవేశించిందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకుని సంఘటన స్థలానికి చేరుకున్న అటవీ సిబ్బంది తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఏనుగు జాడను గుర్తించలేకపోయారు. గతంలో ఎప్పుడు విధంగా ఈ ప్రాంతంలోకి ఏనుగు రావడంతో ప్రజలు భయభ్రాంతికి గురవుతున్నారు అటవీ స్పందించి ఏనుగు బెడద నుండి కాపాడాలని కోరుకుంటున్నారు.

ప్రశాంతంగా79 శాతం పోలింగ్

ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ థామస్ కృపా లక్ష్మి

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటినగరం మండలంలో 79 శాతం పోలింగ్ నమోదు అయినట్లు మండల తాసిల్దార్ పుష్పకుమారి తెలిపారు. మండలంలోని 22 పంచాయితీలలో 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం అన్నూరు పంచాయతీ అల్లాగుంట పోలింగ్ కేంద్రంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వి ఎం థామస్, థామస్ భార్య శాంతి రెడ్డి, సోదరుడు నిధి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా పాదిరి కుప్పం గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపా లక్ష్మి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కృపా లక్ష్మి తల్లి కార్వేటినగరం జడ్పిటిసి పరంజ్యోతి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్వేటినగరం 89 పోలింగ్ బూత్, కేఎం పురం, ఆర్కే విబిపేట చోట్ల ఈవీఎంలు కొద్దిసేపు మురాయించింది . అదేవిధంగా డీఎం పురం పోలింగ్ కేంద్రం వద్ద కేవలం ఒకే ఒక పోలీసు విధులు నిర్వహించడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. చాలా పోలింగ్ కేంద్రాలలో పురుషులకు, స్త్రీలకు, విడివిడిగా ఏర్పాటు చేయకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. వైసిపి, టిడిపి పార్టీల నాయకులు తమ అనుచరులను ఓట్లు వేయించడం జరిగింది. మండలంలోని పోలింగ్ శారలేని ఎంపీపీ లతా బాలాజీ, కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మలు పరిశీలించారు. అదేవిధంగా టిడిపి పార్టీ అధ్యక్షులు, చంగల్రా యాదవ్, నాయకులు నాగేశ్వర రాజు, రవి యాదవ్ ను పరిశీలించారు. మండలంలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్నూరులో ఉదయం డిప్యూటీ సీఎం నారాయణస్వామి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ఎదురెదురుగా రావడంతో కొద్దిసేపు ఉద్రిక్తతకు దారితీసింది . కార్వేటి నగరంఎస్ఐ వెంకటేశ్వర్లు సీఐ సత్యబాబు ఇద్దరికీ సర్ది చెప్పడంతో అక్కడ వారు ఊపిరి పీల్చుకున్నారు. వైసిపి నాయకులు కృపా లక్ష్మి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు . అదేవిధంగా డాక్టర్ థామస్ గెలుపు తధ్యమని టిడిపి నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

తడ మండలంలో 75.83% ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

- పలు పోలింగ్ బూత్ లలో మురాయించిన ఈ వీ ఎం యంత్రాలు ఇబ్బందులు పడ్డ ఓటర్లు

విశాలాంధ్ర - తడ : మండలంలోని 18 పంచాయతీలలోని 43 పోలింగ్ కేంద్రాలలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగింది సాయంత్రం వరకు 75.83% ఓటింగ్ నమోదయింది గ్రద్ద గుంట పంచాయతీ 276 పోలింగ్ బూత్ నందు ఈవిఎం మురాయించడంతో ఓ గంట తర్వాత పోలింగ్ ప్రారంభమైంది పెరియబట్టు గ్రామంలో ఈవీఎం మోరాయించడంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది వెండ్లురుపాడు 264 పోలింగ్ బూత్ లో పోలింగ్ జరుగుతున్న సమయంలో ఈవీఎం లో సాంకేతిక లోపం ఏర్పడడంతో మరో ఈవీఎం ద్వారా రెండు గంటల అనంతరం ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది ఓటింగ్లో పాల్గొనేందుకు చిన్న పిల్లల తల్లులు వృద్ధులు క్యూ లైన్లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు వృద్ధులు చిన్నపిల్లల తల్లులకు ఎన్నికల అధికారులు క్యూ లైన్ లో కాకుండా నేరుగా పోలింగ్ బూత్ లోకి పంపి వారి ఓటు వినియోగించుకునేటట్లు చర్యలు తీసుకున్నారు ప్రతి పోలీస్ స్టేషన్లో ఓటర్లకు ఇబ్బంది తలెత్తకుండా తాగునీరు వీల్ చైర్ ఏర్పాట్లు చేశారు చిన్న చిన్న సంఘటనలు మినహా మండలంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగాయి.

కుప్పంలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

విశాలాంధ్ర - కుప్పం : కుప్పం నియోజకవర్గం నాలుగు మండలాలు అయిన కుప్పం, గుడిపల్లి, శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలోని 243 బూత్ లలో ను అసెంబ్లీ, లోకసభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగింది. కొన్ని చోట్ల చిన్నపాటి ఓటర్లకు పోలింగ్ బూత్ ల వద్ద ఓటర్లకు సదుపాయాలను అధికారులు ఏర్పాటు చేశారు. పలుచోట్ల ఈ వి ఎం లు మోరాయించాయి ధీంతో పలు బూత్ లలో ఓటింగ్ మందకొడి గా సాగింది. నియోజకవర్గ మొత్తం సాయంత్రం 5 గంటలకు పోలింగ్ శాతం 75.78 శాతం సాయంత్రం నమోదుఅయింది. 5 గంటలకు క్యూ లో వున్న ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశాన్ని ఎన్నికల అధికారులు కల్పించారు. దీంతో రాత్రి 9 గం. వరకు పలు బూత్ లలో పోలింగ్ జరిగింది. మొత్తం నియోజకవర్గంలో 2,25,775 ఓటర్ల లో మహిళ ఓటర్లు 1,13,247 పురుషులు 1,12,510 , ఇతరులు 18 మంది ఓటర్లు వున్నారు. అసెంబ్లీ స్థానంలో తెలుగుదేశం పార్టీ , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ అయిన మూడు ప్రధాన పార్టీ అభ్యర్థులు ముగ్గురితో పాటు మరో పది మంది ఇతరులు బరిలో నిలిచారు. ఎన్.డి.ఏ కూటమిలో భాగంగా తెదేపా అభ్యర్థిగా అ పార్టీ అధినేత చంద్రబాబు, వై ఎస్సార్ సిపి అభ్యర్థి గా కె.ఆర్.జె భరత్ బరిలో ఉన్నారు. ఎన్నికల్లో పోలీసు శాఖ వారు ఎలాంటి అవ్వాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలుతీసుకొన్నారు .

ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

విశాలాంధ్ర – కుప్పం : చిత్తూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.ఆర్.జె భరత్ తన సతీమణి దుర్గా పద్మిని తో కలసి ఓటు హక్కును వినియోగించుకొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నేను కుప్పం నియోజకవర్గ ప్రజలకునిత్యం అందుబాటులోఉండి ఈఐదేళ్ళు కోవిడ్ లాంటి కష్ట తర సమయాల్లో సైతం సేవలు చేశానని, ప్రజలు ఎలాంటి కష్టాన్ని అయినా నా దృష్టికి తీసుకోచ్చిన ప్రతీ దాన్ని నా సాయశక్తులా సాధ్యమైన ప్రతీది పరిష్కరించానని , భవిష్యత్తు లోను నేను ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. కుప్పం నియోజకవర్గం ప్రజలు జగనన్నమంచి పాలన , నా సేవలు గుర్తించి నాకు ఓటు వేశారని, నన్ను గెలిపిస్తున్నారని నేను నమ్ముతున్నానన్నారు. వారితో పాటు కుప్పం మున్సిపల్ చైర్మన్ డా. సుధీర్ , ఏ ఎం సి చైర్మన్ విద్యాసాగర్, వైసీపీ నేత సునీల్ వున్నారు.

పలు కేంద్రాలలో కొనసాగుతున్న వైనం

పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు

గూడూరులో 70.61 శాతం పోలింగ్

విశాలాంధ్ర – గూడూరు : గూడూరు పట్టణంలో సోమవారం సాయంత్రం ఐదు గంటల వరకూ 70.61 శాతం ఓటింగ్ పోలైంది. ఉదయం నుండి మందకొడిగా సాగిన ఓటింగ్ విపరీతమైన ఉష్ణోగ్రతలతో మధ్యాహ్నం 4 గంటల వరకూ 35.66 శాతం మాత్రమే నమోదుకాగా, గంటలకు పైన ఆరు గంటల వరకూ ఎండ తీవ్రత తగ్గడంతో 40శాతానికి పైగా ఓట్లు పోలైనట్లు తెలుస్తోంది. పట్టణంలోని 44వ బూత్ పూలతోట, జానకిరామ్ పేట ఎస్సీ హాస్టల్ పోలింగ్ కేంద్రాలలో కొద్దిసేపు ఈవీఎంలు మొరాయించాయి. దీంతో ఓటర్లు మండుటెండల్లో క్యూలైన్లలో ఓటు వేసేందుకు నిరీక్షించాల్సి వచ్చింది. సాయంత్రం ఎండతీవ్రత తగ్గడంతో భారీగా పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చారు. దీంతో రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ జరగవచ్చని, నియోజకవర్గ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలలో 20 వేల మంది వరకూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నిరీక్షిస్తున్నట్లు ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు.

చంద్రగిరి నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

విశాలాంధ్ర –తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు సోమవారం రాత్రి ప్రశాంతంగా ముగిసింది.వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.తిరుపతి రూరల్ మండలంలోని మంగళం,వేదాంత పురం,ఓటేరు,పద్మావతీ పురం, శ్రీనివాస పురం,పాడిపేట,బ్రాహ్మణ పట్టు,తిరుచానూరు, అవిలాల, లింగేశ్వర నగర్, సాయి నగర్, గాంధీ పురం, పేరూరు, పుదిపట్ల, చెర్లోపల్లి, వేంకటపతి నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించారు.పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఓటింగ్ సరళిని పరిశీలించారు.ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని పోలింగ్ కేంద్రాల అధికారులను చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కోరారు.పోలింగ్ సరళిలో చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు ఉదయం నుంచి దూకుడు ప్రదర్శించారు. ఉదయం 11 గంటలకు 26.9 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 37.9 శాతం, మధ్యాహ్నం 3 గంటకు 57.26 శాతం, సాయంత్రం 5 గంటలకు 70.9 శాతం పోలింగ్ నమోదైంది.చంద్రగిరి నియోజకవర్గంలో ఓటర్ల చైతన్యం కనిపించింది. మొత్తం 3,15, 159 మందికి గాను పోలింగ్ శాతం ఆధారంగా 2,23,447 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.నియోజకవర్గ పరిధిలో రామచంద్రాపురం మండలం మినహా మిగిలిన అన్ని చోట్ల ప్రశాంతంగా ఓటింగ్ జరిగింది.టిడిపి శ్రేణులు ఎంతగా రెచ్చ గొట్టే ప్రయత్నం చేసినా.. సంయమనం పాటించిన పార్టీ శ్రేణులు,అభిమానులకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం,అభివృద్ధికి ప్రజలు పెద్ద ఎత్తున ఓటు హక్కు ద్వారా మద్దతు తెలియజేశారనేందుకు పోలింగ్ సరళి స్పష్టం చేస్తుందని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు.

సత్యవేడులో ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్

పలుచోట్ల ఈవీఎం మిషన్లు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యం

విశాలాంధ్ర– సత్యవేడు:సత్యవేడు మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసింది.రాత్రి 8 గంటల సమయానికి సత్యవేడు నియోజకవర్గంలో 80.85 శాతం ఓటు నమోదు అయినట్టు స్థానిక అసిస్టెంట్ ఎన్నికల అధికారి రామాంజనేయులు పేర్కొన్నారు.ఇందులో భాగంగా నియోజకవర్గంలో 215385 మంది ఓటర్లకు గాను ఒక లక్ష 74 వేల 103 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 దాటినా పోలింగ్ కొనసాగుతున్నడంతో ఓటు శాతం పెరిగే అవకాశం ఉంది.కాగా పలుచోట్ల ఈవీఎం మిషన్లు మొరాయించడంతో ఉదయం 7 గంటల నుంచి ప్రారంభం కావలసిన పోలింగ్ గంటపాటు ఆలస్యంగా మొదలయ్యాయి.ఇందులో బాగానే కన్నవరం,మదన్జేరి,సత్యవేడు తదితర ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు మొరాయించడంతో అప్పటికే క్యూ లైన్లో బారులు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు గంటలకొద్దీ వేచి ఉండే పరిస్థితి తలెత్తింది.మండలంలో 49 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఏడు నుంచి పోలింగ్ ప్రారంభమయ్యాయి.అయితే ఉదయం 6:30 కి క్యూలైన్లో ఓటర్లు పెద్ద ఎత్తున బారులు తీరారు. ముఖ్యంగా మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో క్యూలైన్లో వెళ్లి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.అయితే పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగి సాయంత్రం పుంజుకుంది.దీంతో పోలింగ్ సమయం 6 గంటలకు ముగియనుండగా అప్పటికే తండోపతండాలుగా ఓటర్లు పోలింగ్ కేంద్రానికి ప్రవేశించడంతో పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 దాటిన పోలింగ్ కొనసాగింది.కాగా నియోజకవర్గంలో పలువురు ప్రముఖులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ క్రమంలో నారాయణవనం మండలం భీముని చెరువు పోలింగ్ కేంద్రంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం ఓటు హక్కును వినియోగించుకోగా,ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి ఇరుగుళం పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగింది.ఇరుగుళం తదితర పోలింగ్ కేంద్రాల్లో కర్రతో క్యూ లైన్ లో ఏర్పాటు చేయాల్సింది పోయి తాడుతోనే ఏర్పాటు చేయడంపై సర్వత్ర విమర్శలు వస్తున్నాయి.ఏది ఏమైనా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో పాటు పోటీ చేస్తున్న అభ్యర్థుల భవితవ్యం ఈవీఎం మిషన్లో నిక్షిప్తమైన ఓటర్ల తీర్పు కోసం జూన్ నాలుగో తేదీ వరకు వేచి చూడక తప్పదు.

పోలింగ్ కేంద్రానికి ఓటు వేసేందుకు ఉత్సాహంగా వీల్‌చైర్‌లో పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న వయో వృద్ధురాలు

తిరుపతిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు

సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వివిధ ప్రాంతాలలో ఓటర్లు ఓటు వేసేందుకు బారులు తీరారు. అందుకు సంబంధించిన దృశ్యాలు







సదుంలో 77 శాతం పోలింగ్ పూర్తి

విశాలాంధ్ర-సదుం : సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సదుం మండలంలో 77% పోలింగ్ జరిగింది. ఉదయం నుంచి మహిళలు భారీ సంఖ్యలో ఎన్నికల కేంద్రాలకు తరలివచ్చారు .10 గంటలకు మండలంలో 30% పోలింగ్ జరగా మధ్యాహ్నం ఒంటిగంటకు అమ్మగారి పల్లెలో 73 % గొంగివారిపల్లె 77% తిమ్మానేనిపల్లి 60% నమోదయ్యాయి. సదుం పోలింగ్ కేంద్రాన్ని పుంగనూరు వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజంపేట వైకాపా ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రాజంపేట బిజెపి అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి ,తెదేపా పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్ర రెడ్డి వచ్చి పోలింగ్ సరళిని పరిశీలించారు. అదేవిధంగా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ కవిత పోలీస్ అబ్జర్వర్ నవాజ్ అహ్మదులు పరిశీలించారు. నడిగడ్డ , బూరగ మంద గ్రామాల్లో సాయంత్రం 6 గంటల తర్వాత కూడా ఓటర్లు క్యూ లైన్ లో ఉండటంతో పోలింగ్ కొనసాగుతోంది. మంత్రి స్వగ్రామం ఎర్రాతి వారి పల్లెలో పోలింగ్ కేంద్రంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన సతీమణి స్వర్ణమ్మ తల్లి పద్మావతమ్మ జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి జిల్లా వ్యవసాయ సలహా మండల సభ్యుడు సుధీర్ రెడ్డి వేణుగోపాల్ రెడ్డిలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా మండలంలో నడిగడ్డ గొంగివారిపల్లె,సదము, తిమ్మా నాయన పల్లెల్లో పలువురు దివ్యాంగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మొరాయించిన ఈవీఎంలు ఆలస్యంగా పోలింగ్ గంటల తరబడి ఓటర్ల నిరీక్షణ

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ :నారాయణవనం మండలంలో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు సక్రంగా పని చేయలేక జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఈవీఎంలు మొరాయించడంతో పలు పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది.సోమవారం మండలంలోని కళ్యాణపురం, వెత్తలతడుకు బ్రాహ్మణ తంగల్ నారాయణవనం పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు పూర్తిగా పనిచేయకపోవడంతో ఉదయం 10.00 గంటలకు ఈవీఎంలను మార్చి ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. 134,136, 140 పోలింగ్ కేంద్రంలో ఉదయం 9.00 గంటల వరకు ఈవీఎంలు మొరాయించాయి. దీంతో ఓటర్లు గంటల తరబడి క్యూ లైన్లలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది వృద్ధులు సైతం కూర్చోవడానికి సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో క్యూ లైన్ లోనే నిలబడలేక ఇబ్బందులు పడ్డారు. వెత్తల తడుకులో క్యూ లైన్ లో వేచి ఉండలేక ఓటర్లు ఇంటి ముఖం పట్టారు.

నగరిలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

80% గా పోలింగ్ నమోదు

జగనన్న అందించిన సంక్షేమం అభివృద్ధికి కృతజ్ఞతగా ప్రజల ప్రతిస్పందన

రోజమ్మ గెలుపు తథ్యం అంటున్న నగరి ఓటర్లు

పోలింగ్ కు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన మంత్రి రోజమ్మ

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్: నగిరి :నగరి నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్, పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ వైఎస్ఆర్సీపీ కుటుంబ సభ్యులకు, అభిమానులకు, నాయకులకు, కార్యకర్తలకు, పోలింగ్ సిబ్బందికి పోలీసు అధికారులకు జగన్ అన్న అభిమానులకు అందరికీ పేరు పేరునా మంత్రి రోజమ్మ ధన్యవాదాలు తెలిపారు. 80% పోలింగ్ నమోదవడం శుభసూచకం అన్నారు, యువత మహిళా లోకం పేద బడుగు బలహీన వర్గాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు వైసిపి వెంటే ఉన్నందుకు సంతోషంగా ఉందన్నారు. మహిళలు, వృద్ధులు పెద్దసంఖ్యలో ఓటింగులో పాల్గొని జగనన్నకి మద్దతు పలికారని అన్నారు. ఈ ఎన్నికల యుద్ధంలో పేదలు గెలిచారని, ప్రజలు ఓటుతో పెత్తందారులకు సమాధానం చెప్పారన్నారు. జగన్ గెలుపు తథ్యం అని తెలిసిందని, పెత్తం దారులు పరారీలో ఉన్నారన్నారు. నగరిలో ఎవరెన్ని కుతంత్రాలు చేసినా, కుల రాజ కీయాలు, కుట్ర రాజకీయాలు చేసినా జనం మాత్రం పట్టించుకోకుండా నిజా యతీగా తనకు మద్దతు పలికారని అన్నారు. నాతో ధైర్యంగా నిలిచి, నాకోసం శ్రమించిన నా వైసిపి కుటుంభ సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

రాయిదాడికి గురైన మాజీ ఉపసర్పంచ్

విశాలాంధ్ర-చిల్లకూరు: చిల్లకూరు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నతపాఠశాల పోలింగ్ బూతు సమీపంలో సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో, చిల్లకూరు మాజీ ఉపసర్పంచ్ మేనకూరు విజయభాస్కర్ రెడ్డి, గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన రాయిదాడిలో గాయపడటం జరిగింది.

ఎస్ఐ చేయిచేసుకున్నాడని టిడిపి నాయకుడి ఆరోపణ

విశాలాంధ్ర-చిల్లకూరు: గూడూరు అసెంబ్లీ నియోజకవర్గ సార్వత్రిక ఎన్నికల ప్రక్రి యలో , సోమవారం చిల్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోకొండా రామచంద్రారెడ్డి అనే తెలుగుదేశం నాయకుడు తనపై చిల్లకూరు ఎస్ఐ అంజిరెడ్డి చేయిచేసుకున్నారని ఆరోపించారు.

ప్రశాంతంగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికలు

కొన్నిచోట్ల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : పుత్తూరు సార్వత్రిక ఎన్నికలు నగరి నియోజకవర్గంలో. ఎన్నికల కేంద్రంలో తమ ఓటర్లు ఎన్నికల కేంద్రం వెళ్లి ఉదయం ఏడు గంటల నుంచి క్యూ లైన్ లో నిలబడి వారి ఓట్లను యధావిధిగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడ ఎలాంటి గొడవలు లేకుండా బందోబస్తుతో పోలీసులు ఓటర్లకు భద్రత కల్పించారు. ఓటింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగింది అలాగే ఎమ్మెల్యే అభ్యర్థులు ఆర్కే రోజా. పుత్తూరు లోని పలు చోట్ల ఎన్నికల కేంద్రాలను పరిశీలించారు. అలాగే తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్. నగరి నింద్ర విజయపురం ప్రాంతాల్లో కూడా. ఎన్నికల కేంద్రాల వద్దకు వెళ్లి పరిశీలించారు. అలాగే వారు కూడా ఎలాంటి గొడవలు లేకుండా చూడాలని పోలీసులకు చెప్పడం జరిగింది. 6 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయడం జరిగింది. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసింది ఎన్నికల కేంద్రం వద్ద ఓటు వేసేందుకు ఓటర్లు బారులుగా నిలబడ్డారు.

రేణిగుంటలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

ఈవిఎంల మొరాయింపు, పోలింగ్ ప్రక్రియ ఆలస్యం

ఆలస్యం కారణంగా ఇంటికి తిరిగి వెళ్లిన ఓటర్లు

విశాలాంధ్ర - రేణిగుంట : రేణిగుంటలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు జరగడంతో ఎన్నికల అధికారులు, పోలీసులు, పార్టీ నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. ఈవిఎంల మొరాయింపు వలన పోలింగ్ ఆలస్యంగా మొదలయిన సంఘటన పలు పోలింగ్ కేంద్రాలలో చోటుచేసుకున్నాయి. ఆలస్యం పోలింగ్ ప్రక్రియ జరగడంతో ఓటర్లు ఇంటికి తిరిగి వెల్లారు. ఈ విదంగా జరగడం చాలా అరుదు అని, ఇంత వరకు ఎప్పుడు ఇలా ఓటర్లు తిరిగి వెళ్లడం చూడలేదని పక్క ఉన్న ఓటర్లు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రేణిగుంట మండలంలో సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంతంగా సజావుగా సాగాయి మండలం రేణిగుంట మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో భాగంగా 66 పోలింగ్ భూతులలో ఎన్నికలు సజావుగా సాగాయి. చాలా క్లిష్టమైన పోలింగ్ బూతులు సైతం ఈ సార్వత్రిక ఎన్నికలలో సజావుగా సాగడం జరిగింది. ఈసారి ఎన్నికలలో గొప్పగా వృద్ధులు, మహిళలు ఓటేయడం ఆలోచించ తగ్గ విషయం. ఇంతటి ఎండలో సైతం పోలింగ్ బూతులలో ఈవీఎంలు మొరాయించిన కూడా రెండు మూడు గంటలు ఓపికగా వేచి ఉండి మరీ ఎన్నికలలో పాల్గొని ఓటు వేసారు. కొన్ని భూతులలో అర్థగంట, గంట సమయం ఆలస్యంగా ఎన్నికలు మొదలయిన ఆ భూతులలో ఓటింగ్ శాతము జరగడం గొప్ప విషయం . కొన్ని భూతులలో ఎన్నికల ప్రక్రియ చాలా ఆలస్యంగా జరగడం వలన ఓటర్లు తిరిగి ఇంటికి వెళ్లిన సందర్భాలు చాలా జరిగాయి.

ఎర్రతివారిపల్లెలో ఓటు వేసిన
మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం

విశాలాంధ్ర - పుంగనూరు: సదుం మండలం ఎర్రతివారిపల్లె లో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకుని అనం తరం పోలింగ్ బూతుకు వెళ్లి రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచం ద్రారెడ్డి ఆయన సతీమణి పెద్దిరెడ్డి స్వర్ణలతారెడ్డి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తమ ఓటును వినియోగించుకోవడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా స్వచ్ఛం దంగా పోలింగ్ బూత్ కు వచ్చి తమ ఓట్లను వినియోగించుకోవాలని కోరుతూ నియోజ వర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఓటు వేయాలని కోరడం జరిగింది.

ఓటు హక్కు వినియోగించుకున్న కిలివేటి

విశాలాంధ్ర -తడ : మండలం కాదలూరు గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్న వైఎస్ఆర్సీపీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ కిలివేటి సంజీవయ్య.

ఓటు హక్కును వినియోగించున్న ప్రముఖులు

విశాలాంధ్ర - గూడూరు : పట్టణ ప్రముఖులు, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సోమవారం వివిధ పోలింగ్ బూత్ లలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలుత బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ వెలగ పల్లి వరప్రసాద్ రావు కుటుంబ సమేతంగా వాలాయనం దపురం లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ సాయంత్రం జెడ్పీ బాలుర హైస్కూల్ లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. అలాగే ఆర్డీఓ, డివిజన్ ఎన్నికల అధికారి ఎం. కిరణ్ కుమార్ రెండవ పట్ట ణంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. పట్టణంలోని కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు చాలా తక్కువ స్థాయిలో కని పించగా కొన్నిబూత్‌లలోమాత్రం ఆరుగంటలుదాటినా రద్దీ తగ్గలేదు.

పుంగనూరులో ప్రశాంతంగా ఎన్నికలు

విశాలాంధ్ర పుంగనూరు: నియోజవర్గంలో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల అధికారి మధుసూదన్ రెడ్డి నియోజకవర్గ పరిధిలో ఉన్న రెండు లక్షల 37, 880 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకునే విధంగా అన్ని ఏర్పాట్లను చేయడం జరిగింది. అందులో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం 6 గంట లకు వరకు ఓటు వేసుకోవడానికి అవకాశం కల్పించడంతో ఓటర్లు స్వచ్ఛందంగా క్యూలో నిలబడి తమ ఓటును వినియోగించుకోవడం జరిగింది. ఎన్నికల సమయం ముగింపు వరకు దాదాపు 77% పోలింగ్ శాతం నమోదు కావడం జరిగింది. ఇంకను క్యూలో వందలాదిమంది ఉండడంతో ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు వారందరికీ ఓటు హక్కు కల్పించడంతో ఇంకా నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉన్నది పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో అక్కడక్కడ ఓటింగ్ సరళి ఆలస్యం కావడం జరిగింది.

ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థులు

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్: పుత్తూరు నగరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థులైన వైసీపీ అభ్యర్థి ఆర్కె రోజా, ఎన్ డి ఏ అభ్యర్థి గాలి భాను ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాకేష్ రెడ్డిలు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నగిరి నియోజకవర్గం నగిరి మున్సిపల్ ఆఫీస్ నందు మంత్రి ఆర్కె రోజా తమఓటునువినియోగిం చుకున్నారు. రామచంద్రపురం మండలం వెంకటాపురం లో నగిరి నియోజకవర్గ తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ సోమవారం ఓటేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడు తూ, ప్రతిఒక్కరు ఓటు హక్కుని వినియోగించుకోవాలని తెలుగుదేశం పార్టీ అధికారంలో రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పుత్తూరు బూత్ 63 నెంబర్ ఎస్ ఆర్ ఎస్ జూనియర్ కళాశాల నందు ఓటును నగరి కాంగ్రెస్ అభ్యర్థి పోచారెడ్డి రాకేష్ రెడ్డి వేశారు.

బ్రాహ్మణ కాలువలో
గాలిలో నాలుగు రౌండ్లు కాల్పులు జరిపిన సిఆర్‌పిఎఫ్

- ఉద్రిక్తతలు నెలకొని భయభ్రాంతుల్లో ప్రజలు

విశాలాంధ్ర - రామచంద్రాపురం : మండలంలోని బ్రాహ్మణ కాలువ ఏఏడబ్ల్యు పోలింగ్ స్టేషన్ లో వైసిపి,టిడిపి వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో గ్రామంలో ఇండ్లపై పరస్పర దాడులు జరగడంతో పోలింగ్ స్టేషన్ ఆవరణంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ యొక్క ఉద్రిక్తత పరిస్థితి అదుపులోకి తీసుకొని వచ్చేందుకు బిఎస్ఎఫ్ బలగాలు గాలిలోకి నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి పరిస్థితి నెలకొంది పోలీసులు అదుపులోనికి తీసుకొచ్చారు. ఈ సంఘటన తెలుసుకొని వైయస్సార్ సిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నాని సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువురు అభ్యర్థులు తమ తమ కార్యకర్తల ద్వారా పరిస్థితులు తెలుసుకొని ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది అనంతరం ఎలక్షన్ కమిషన్ అదనపు బందోబస్తు ఏర్పాటు చేసి పోలింగ్ ను కొనసాగించారు. మండలం లో 89 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. ఎండ తీవ్రతలు దృశ్య ఉదయం 6 గంటలకే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల దగ్గర బారులు తీరారు. మధ్యాహ్నం పోలింగ్ కేంద్రాలు వెధవలు పోయాయి. పలు పోలింగ్ స్టేషన్లో ఈవీఎంలు పనిచేయక ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. కాలేపల్లి పోలింగ్ స్టేషన్ ఆఫీసర్ ఆలస్యంగా పోలింగ్ జరుపుతున్నారని గ్రామస్తులు గొడవ చేయడంతో గంటపాటు పోలింగ్ నిలిచిపోయింది. అనంతరం మండల తాసిల్దార్ వచ్చి గ్రామస్తులకు సర్ది చెప్పడంతో తిరిగి పోలింగ్ ప్రారంభమైంది.

చెదురు ముదురు సంఘటనల మినహా
చంద్రగిరిలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

విశాలాంధ్ర - చంద్రగిరి: చెదురు ముదురు సంఘటనలు మినహా చంద్రగిరి లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. వేసవి తాపం అధికంగా ఉండటంతో ఉదయం ఏడు గంటల నుండి పోలింగ్ ప్రారంభం అవుతుందనగా ఉదయం 6:30 గంటల నుండే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఎన్నికల సందర్భంగా చరిత్రలో చంద్రగిరిలో ఘర్షణలో జరిగిన సందర్భాలు లేవు. ఎన్నికల వరకే తాను ఈ పార్టీ అంటే మరొకరు ఇంకొక పార్టీ అంటూ ప్రచారాలు నిర్వహించి ఎన్నికల అనంతరం ఒకరికొకరు కలిసిమెలిసి ఉండటం అనవాయతీ. 2024వ సంవత్సరం ఎన్నికల్లో కూడా ఇదే ఆనవాయితీని కొనసాగించారు. ఏ పోలింగ్ బూత్ వద్ద ఎలాంటి ఘర్షణ వాతావరణం నెలకొనలేదు. చంద్రగిరి కొత్తపేట జె ఆర్ కె ఆర్ పాఠశాలలో 4 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయగా పాఠశాల పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్ళటానికి ఇరుకైన సందు కావడంతో ఓటర్లు నానా అగచాట్లు ఎదుర్కొన్నారు. ఈ పర్యాయం ఓటర్ స్లిప్పు లు బిఎల్వోలే ఇంటింటికి వెళ్లి అందజేయడంతో ప్రధాన పార్టీలు ఏర్పాటుచేసిన షామియానాల వద్ద ఓటర్లు వెళ్ళక నేరుగా పోలింగ్ బూతులు వద్దకే వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పర్యాయం తమ ఓటు హక్కుని ఎలాగైనా వినియోగించుకోవాలన్న ధ్యేయంతో ఇతర రాష్ట్రాలు ఇతర దేశాల నుండి ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించు కున్నారు. ప్రధాన పార్టీలు బెంగళూరు చెన్నై హైదరాబాద్ లో ఉంటున్న తమ మద్దతుదారులైన ఓటర్లు ఓటు హక్కు వినియోగించు కోవటానికి ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేశారు. ఉదయం నుండి ఎక్కువ సంఖ్యలో ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకోగా సాయంత్రం నాలుగు గంటలకల్లా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పల్చబడి 5 గంటలకల్లా బోసిపోయాయి. ఓటర్ గుర్తింపు కార్డు కలిగి ఓటర్ జాబితాలో పేరు లేని వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు అన్న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను చంద్రగిరి బాలుర ప్రభుత్వ కళాశాలలోని ఓ పోలింగ్ కేంద్రానికి విచ్చేసిన 90 సంవత్సరాల వృద్ధుడును తమకు ఎలాంటి ప్రత్యేక సమాచారం లేదన్న కారణంతో తిప్పి పంపారు. ఈ పర్యాయం తెలుగుదేశం పార్టీ వైఎస్ఆర్సిపి కి చెందిన ఏజెంట్లు దృఢ నిశ్చయంతో ఐదున్నర గంటలకు ప్రారంభమైన మాక్ పోలింగ్ మొదలుకొని ఈవీఎంలు సీలింగ్ వేసే వరకు తమ బాధ్యతలను సవ్యంగా నిర్వర్తించారు. ఉదయం వైకాపా అభ్యర్థి బాబాయ్ చెవిరెడ్డి రఘునాథరెడ్డి సోదరుడు హర్షిత్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పులివర్తి నాని, సాయంత్రం ఎన్ డి ఏ కూటమి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు పోలింగ్ కేంద్రాలకు విచ్చేసి ఓటింగ్ సరళిని సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.